క్లుప్తంగా

సిమెంట్ రోడ్లతో గ్రామాల అభివృద్ధి



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

అల్లాదుర్గం(మెదక్): సిమెంట్ రోడ్లతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బలరామ్, మండల అధ్యక్షుడు శేషారెడ్డి చెప్పారు. శనివారం మండల పరిధిలోని బహిరన్‌దిబ్బ, గొల్లకుంట తండా, చెవెళ్ల గ్రామాలలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేయడంతో పాటు, గ్రామాలలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చురుకుగా చేపడుతున్నట్లు చెప్పారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

చిలప్‌చెడ్ (నర్సాపూర్): మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శనివారం భూమిపూజ చేశారు. ఎంపీపీ వినోద రెడ్డి, స్థానిక ఎంపీటీసీ మల్లయ్య పాల్గొని గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పరుశరామ్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ



నియామకమైన కమిటీ

నిజాంపేట (మెదక్): స్థానిక ప్రాథమిక పాఠశాలలో శనివారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని హెచ్‌ఎం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కమిటీని నియమించామని ఆయన చెప్పారు. చైర్ పర్సన్‌గా సీహెచ్ శ్వేత, కన్వీనర్‌గా హెచ్‌ఎం ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ కమిటీలో ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున 15 మంది తల్లులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

చిన్నశంకరంపేటలో..

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలుగా ఎం.స్రవంతి ఎన్నికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. మండలంలోని చందంపేట జెడ్పీపాఠశాల అధ్యక్షురాలుగా దుర్గం లలిత ఎన్నికై నట్లు హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. సూరారం ప్రాథమిక పాఠశాల అధ్యక్షురాలుగా వై.అనిత ఎన్నికై నట్లు హెచ్‌ఎం శివప్రసాద్ తెలిపారు. అలాగే నార్సింగి మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలుగా మైలారం అనిత ఎన్నికైనట్లు హెచ్‌ఎం మురళీమోహన్ తెలిపారు.

గుండెపోటుతో రైతు మృతి



చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లి గెరిల్లాతండాకు చెందిన బాలునాయక్ గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం మధ్యాహ్నం పొలం పనులకు వెళ్లి తిరిగివచ్చిన బాలు నాయక్ అస్వస్థకు గురవడంతో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చర్చికని వెళ్లి వ్యక్తి అదృశ్యం



టేక్మాల్(మెదక్): వ్యక్తి అదృశ్యమైన ఘటన టేక్మాల్ మండలంలోని పల్వంచలో శనివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పల్వంచ భూమయ్య(25) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 14న టేక్మాల్ చర్చికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. భూమయ్య భార్య నీరజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): భర్త వేధింపులు భరించలేక భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన మండలంలోని గోమారంలో శనివారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన బేగరి రేణుక(28) ఓ ప్రైవేట్ పరిశ్రమలో పని చేస్తుంది. 14న తన కూతురు చందన చదువుతున్న పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవానికి హాజరైంది. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన కూతురుకు తన తల్లి కనిపించలేదు. భర్త వేధింపులు భరించలేక వెళ్లిపోతున్నట్లు రాసిన లేఖను కుటుంబ సభ్యులు గుర్తించారు. రేణుక సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సమయానికి రాని సార్లు

చిన్నశంకరంపేట (మెదక్): ఒంటిపూట బడులు ప్రారంభమవడంతో ఉదయం 7:45 లోపు పాఠశాలకు చేరుకోవాల్సిన ఉపాధ్యాయులు సమయం దాటిపోయినా పాఠశాలకు చేరుకోవడంలేదు. నార్సింగి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం నార్సింగి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అశ్వత్థామ, వడ్డెర కాలనీ ఉపాధ్యాయురాలు కవిత పాఠశాలకు సమయానికి విధులకు హాజరు కాలేదు. దీంతో స్థానికులు కాంప్లెక్స్ హెచ్‌ఎం మురళీమోహన్‌కు సమాచారం అందించగా, ఆయన వచ్చి పాఠశాలలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమయానికి విధులకు రాకపోతే చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండలంలోని శేరిపల్లి పాఠశాలలోను శుక్రవారం ఉపాధ్యాయులు సమయానికి రాలేదని ఎంఈఓ బుచ్చానాయక్‌కు సమాచారం అందించారు. ఆయా ఉపాధ్యాయులకు మెమోజారీ చేయనున్నట్లు ఎంఈఓ బుచ్చానాయక్ తెలిపారు.



పాఠశాలను పరిశీలిస్తున్న మురళీమోహన్

గ్రామాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని ప్రియాంక కాలనీ, మాడ్చెట్‌పల్లి, కోళపల్లి తదితర గ్రామాలలో సీసీ రోడ్లను ప్రారంభించడంతో పాటు పలు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నారాయణఖేడ్ నియోజకవర్గాన్ని రాబోయే రోజుల్లో అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, సీనియర్ నాయకులు సురేందర్‌రెడ్డి, నారాగౌడ్, ఆర్యన్ సంతోష్, సంగమేశ్వర్, సత్యనారాయణ, దేవేందర్, గంగారెడ్డి, పెరుమాండ్లు, రఘుపతిరెడ్డి, భానుగౌడ్, గోవింద్‌రావు, రోమాల సాయిలు, సాయిరెడ్డి, జహంగీర్ తదితరులున్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే



పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): మండలంలోని రాంపూర్ శివారులోని పంట పొలాలను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతులు తమ చెరువులోకి కాలువ నీరు రాకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని ఎమ్మెల్యేకు విన్నవించారు. శివారులో కాలువ నిర్మాణ స్థలం పరిశీలన జరిపి అధికారులతో మాట్లాడి చెరువులోకి నీటిని రప్పించేలా చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం మక్కరిజీపేట రాయిన్‌చెరుతండాలో గిరిజనుల జగదంబ ఆలయ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, పట్నం తానీషాతోపాటు రైతులు ఉన్నారు.

బస్టాండ్‌లో కూలింగ్ వాటర్ సదుపాయం

కౌడిపల్లి(నర్సాపూర్): వేసవి సందర్భంగా ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకుగాను బస్టాండ్‌లో కూలింగ్ వాటర్ కోసం ఫ్రిజ్‌ను ఏర్పాటు చేసినట్లు మెదక్ ఆర్‌టీసీ డీఎం సుధ తెలిపారు. శనివారం కౌడిపల్లి బస్టాండ్‌లో ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్‌ల కోసం వేచి చూసే ప్రయాణికులు తాగునీటికి ఇబ్బంది పడకుండా ఉండాలని ఫ్రిజ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆర్‌టీసీ దీనిని ఏర్పాటు చేయగా ధర్మాసాగర్ గ్రామానికి చెందిన మర్రి శ్రీధర్ ప్రతి రోజు ఉచితంగా మినరల్ వాటర్ అందిస్తున్నారని చెప్పారు. మర్రి శ్రీధర్‌ను డీఎం సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక ఆర్‌టీసీ బస్‌పాస్ కౌంటర్ ప్రతినిధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీధర్‌ను సన్మానిస్తున్న డీఎం సుధ

కర సేవకుల పాత్ర మర్చిపోలేనిది

సంగ్రామ్ మహారాజ్

నర్సాపూర్ రూరల్: అయోధ్యలో రామ మందిర నిర్మాణంలో కర సేవకుల పాత్ర మర్చిపోలేనిదని సంగ్రామ్ మహారాజ్, మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. శనివారం నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంటలో ఓ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునందన్‌రావు, గురువారెడ్డిల ఆధ్వర్యంలో అయోధ్య కరసేవకులను సన్మానించారు. ముఖ్యఅతిథిగా హాజరై సంఘం మహారాజ్, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాట్లాడారు. కొంత మంది కర సేవకులు ప్రాణ త్యాగాలు చేశారన్నారు. 60 మందిని శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘసాని సురేష్, గోడ రాజేందర్, ఆకుల రాజయ్య, మాజీ సర్పంచ్ రాజేందర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పాప గారి రమేశ్‌గౌడ్, బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కర సేవకులను సన్మానిస్తున్న దశ్యం

రాజకీయ లబ్ధికోసమే కవిత అరెస్ట్

పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్

రేగోడ్(మెదక్): ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ బీఆర్ఎస్, బీజేపీల రాజకీయ లబ్ధికోసమేనని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, జెడ్పీటీసీ యాదగిరి ఎద్దేవా చేశారు. రేగోడ్‌లో శనివారం మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీలు కవిత అరెస్ట్ డ్రామా ఆడుతున్నాయని ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసినా కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు.

బోరంచ ఎత్తిపోతలకు రూ.4కోట్లు

గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బోరంచలో రూ.21 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ తాజాగా మరో రూ.4.21కోట్లు మంజూరు చేశారన్నారు. అక్కడి నుంచి రేగోడ్, చౌదర్‌పల్లి తదితర చెరువులకు కాలువల ద్వారా నీటి సరఫరా చేస్తామని, ఇందుకు కూడా త్వరలో నిధులు మంజూరు కానున్నాయని చెప్పారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు గున్న సంగమేశ్వర్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు చోటుమియా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నార్సింగిలో ..

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్ఎస్ నాయకురాలు కవిత అక్రమ అరెస్ట్‌కు నిరసనగా నార్సింగిలో నాయకులు రోడ్డుపై బైటాయించారు. ఎంపీపీ చిందం సబిత, జెడ్పీటీసీ కృష్ణారెడ్డి మాట్లాడుతు బీఆర్ఎస్‌పై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం

జూనియర్ సివిల్ జడ్జి అనిత



మాట్లాడుతున్న జడ్జి అనిత

నర్సాపూర్: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కె.అనిత పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ కుదుర్చుకుని కేసులను తొలగించుకున్నారని చెప్పారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏపీపీ రాఘవేంద్రరావు, సీఐ జాన్‌రెడ్డి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ కోసం డిమాండ్

వెల్దుర్తి(తూప్రాన్): మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ఎంపీ టికెట్ నీలం మధుకు ఇవ్వాలని వెల్దుర్తి మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు కుస్తి శేఖర్ పార్టీ హైకమాండ్, సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మెదక్ సెగ్మెంట్‌లో ముదిరాజ్ ఓట్లు అధికంగా ఉండడంతో మధుకు విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు.

విద్యుత్ అంతరాయంతో వెతలు

నర్సాపూర్: పట్టణంలో కరెంటు సరఫరాలో మాటి మాటికీ అంతరాయం ఏర్పడడంతో శనివారం వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ ఎపుడు పోతుందో? ఎప్పుడు వస్తుందో? తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండల విద్యుత్తుశాఖ ఏఈ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా పట్టణంలో షాదిఖానా సమీపంలో విద్యుత్ వైర్లపై కోతి పడడంతో ట్రిప్ అయిందని, వైర్లపై నుంచి కోతి కళేబరాన్ని తొలగించి సరఫరాను పునరుద్ధరించామని చెప్పారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నిజాంపేట(మెదక్): ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తంచేస్తూ ఆర్యవైశ్య సంఘం సభ్యులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్య వైశ్యుల కోసం తన 100 రోజుల పాలనలో ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం చాలాగొప్ప విషయమన్నారు. గత పాలకులు ఆర్యవైశ్యులకు చేసిందేమీ లేదని కాంగ్రెస్ పార్టీ ఆర్య వైశ్యులను గుర్తించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు, జిల్లా అధ్యక్షుడు మైనంపల్లి హనుమంత రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య జిల్లా గౌరవ అధ్యక్షుడు సుధా మల్లేశం, మండల అధ్యక్షుడు చేరివిరాల ప్రవీణ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు చీకోటి వెంకటేశం, కార్యవర్గ సభ్యులు పందిరి భూమయ్య, ప్రకాశం, గంగాధర్, గందే రాములు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్యులు

చాకరిమెట్లలో భక్తజన సందడి

శివంపేట(నర్సాపూర్): ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారులు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దంపతులు సామూహిక వ్రతాలాచరించారు. దొంతి గ్రామానికి చెందిన పిట్ల సత్యనారాయణ నిత్య అన్నదానం కోసం రూ.51వేలు విరాళం అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఆలయ కమిటీ పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఈఓ శ్రీనివాస్, ఆలయ వ్యవస్థాపకుడు, చైర్మన్ ఆంజనేయశర్మ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దాత

11కిలోల మొక్కజొన్న దిగుబడి

హవేళీఘణాపూర్ (మెదక్): ఔరంగాబాద్ తండా పరిధిలోని కెతావత్ రాజుకు చెందిన సర్వే నెంబర్ 72/ఈలో మొక్కజొన్న పంట కోత ప్రయోగం నిర్వహించినట్లు జిల్లా ఉపగణాంక అధికారి వెంకటేశ్ శనివారం తెలిపారు. 5/5 మీటర్ల విస్తీర్ణంలో పంట కోత ప్రయోగం చేయగా 11కిలోల దిగుబడి వచ్చినట్లు చెప్పారు. ఈ ప్రయోగాల ఆధారంగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో పంట అంచనా వేసేందుకు వీలుంటుందని, డివిజనల్ ఉప గణాంక అధికారి బద్రినాథ్, సహాయ అధికారి సురేశ్ పాల్గొన్నారు.



పంటకోత ప్రయోగం చేస్తున్న జిల్లా ఉపగణాంక అధికారి వెంకటేశ్

రోడ్డు పనుల ప్రారంభోత్సవం రసాభాస

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాలలో శనివారం సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో రసాభాస చోటుచేసుకుంది. గ్రామానికి ఉపాధి హామీ పథకంద్వారా సీసీరోడ్డు నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరయ్యాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి సీసీ రోడ్డు పనులను ప్రారంభించేందుకు గ్రామానికి వచ్చారు. దీంతో బీజేపీ అధ్యక్షుడు రాకేశ్, బీఆర్ఎస్ నాయకులు గౌరిరెడ్డి, బెంది రమేశ్‌గౌడ్ తదితరులు కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. ఏ హోదాతో ఆవుల రాజిరెడ్డి సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తారని పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఓవైపు వాగ్వివాదం జరుగుతుండగానే ఆవుల రాజిరెడ్డి కొబ్బరికాయ కొట్టి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది.



కాంగ్రెస్ నాయకులను నిలదీస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ నేతలు

బూర్గుపల్లి ఘటన బాధాకరం

కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు

హవేళీఘణాపూర్: మండల పరిధిలోని బూర్గుపల్లిలో జరిగిన ఘటనలో గ్రామానికి చెందిన రాజు మృతి చెందడం బాధాకరమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని బూర్గుపల్లిలో మృతుడు రాజు కుటుంబాన్ని పరామర్శించి రూ.25వేల ఆర్థిక సహాయం అందజేశారు. జిల్లా అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు మానెగల్ల రామకిష్టయ్య, అరుణ, సాయి, అల్లుడు జగన్ ఉన్నారు.



మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న నీలం మధు

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న రాములు తదితరులు

నిజాంపేట (మెదక్): మండలంలోని చౌకత్ పల్లి గ్రామానికి చెందిన కొంతం సత్తయ్య(55) అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సూర రాములు శనివారం మృతుడి కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎం.రాజు, భాస్కర్, రాములు, పత్తి, రమేశ్, రవీందర్, మల్లయ్య, పరశురాములు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారం అవసరం



మాట్లాడుతున్న ఆర్‌డీఓ జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్: ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళిని అమలు చేసేందుకు పార్టీల నాయకులు తమతో సహకరించాలని ఆర్‌డీఓ జగదీశ్వర్‌రెడ్డి కోరారు. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ శనివారం విడుదల చేయగానే ఆయా పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

గ్రంథాలయ భవనం నిర్మించాలి

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామంలో గ్రంథాలయ భవనం నిర్మించాలని కూచారం గ్రామ నేచర్ ఐకాన్ యువత కలెక్టర్, డీఆర్డీఓ శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం వినతి పత్రం అందజేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **మంభోజిపల్లి తైబజార్ వేలంపాట**

హవేళీఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని మంభోజిపల్లి పంచాయతీలో జరిగే సంతకు వేలంపాట నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి నగేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాదికి నిర్వహించిన ఈ వేలం పాటలో అదే గ్రామానికి చెందిన మేకల కృష్ణ రూ.3.40లక్షలకు దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. గ్రామస్తులు నాగరాజు, బోల నర్సింహులు, మేకల కృష్ణ, ఆంజనేయులు, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

◆ **ఆరు పాఠశాలలకు ఒకే అధ్యక్షురాలు**

కౌడిపల్లి(నర్సాపూర్): అమ్మ ఆదర్శ కమిటీలలో మూడు పంచాయతీలలోని ఆరు పాఠశాలలకు ఒకే మహిళ చైర్‌పర్సన్ (అధ్యక్షురాలు)గా శనివారం ఎంపికయ్యారు. భుజిరంపేట పంచాయతీ నుంచి పీర్యతండా, మనంతయపల్లి తండాలు పంచాయతీలుగా ఏర్పాడ్డాయి. ఐకేపీ గ్రామ సమాఖ్య మాత్రం ఏర్పాటు కాలేదు. దీంతో భుజిరంపేట గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు బక్క సబిత ఆయా పంచాయతీలలోని పాఠశాలలకు చైర్‌పర్సన్‌గా ఎంపిక అయినట్లు ఏపీఎం సంగమేశ్వర్, సీసీ నాగరాజు తెలిపారు.

◆ **వధువు కుటుంబానికి చేయూత**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పర్కిబండకు చెందిన నిమ్మల కుమార్, లక్ష్మీల కూతురు నూతన వధువు వివాహం కోసం చేయూతలో భాగంగా గ్రామానికి చెందిన రఘువీరారెడ్డి శనివారం పుస్తె, మట్టెలను అందజేశారు. వారి వెంట కుమార్, రమేశ్, ఏమా నాగరాజు, ఆంజనేయులు తదితరులున్నారు.

◆ **బోరుబావి తవ్వించిన జెడ్పీ చైర్‌పర్సన్**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని దండుపల్లి గ్రామంలోగల ఎల్లమ్మ దేవాలయం వద్ద భక్తుల సౌఖర్యార్థం జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత జెడ్పీ నిధులతో శనివారం బోరుబావిని తవ్వించారు. అనంతరం దేవాలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట వెంట ఎంపీటీసీ లత, నాయకులు వెంకట్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు రమేశ్‌గౌడ్, నరేందర్ తదితరులున్నారు.

◆ **గృహజ్యోతి కోసం దరఖాస్తులు**

కౌడిపల్లి(నర్సాపూర్): గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు రాకపోవడంతో లబ్ధిదారులు శనివారం ఎంపీడీఓ కార్యాలయం కౌంటర్‌లో దరఖాస్తు చేశారు. అర్హులమైనప్పటికీ తమకు ఆ పథకాలు రావడం లేదని చెప్పారు. దీంతో ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ దరఖాస్తును పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

◆ **పోషణా పక్వాడా..**

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేటలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి ఆధ్వర్యంలో శనివారం పోషణా పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం ప్రాముఖ్యత, ఆరోగ్యం గురించి వివరించారు. అనంతరం సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం వారికి పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భూదేవి, స్వర్ణలత, స్వప్న, పద్మ, రేణుక తదితరులున్నారు.

◆ **పోలీసుల ఫ్లాగ్ మార్చ్**

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లితోపాటు వెల్మకన్న, తిమ్మాపూర్ గ్రామాలలో నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, స్థానిక ఎస్‌ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించు కోవాలని చెప్పారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

◆ **సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో అధికారులు, నాయకులు సీసీ రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. ఉపాధిహామి పథకంలో రూ.15 లక్షలు నిధులు మంజూరు కావడంతో గ్రామంలోని పలు కాలనీలలో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **భూమి పూజ..**

నర్సాపూర్: నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శనివారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ భూమి పూజ చేశారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు యాదగిరి, సరితలతో పాటు పలువురు పార్టీ నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు సకాలంలో నాణ్యతగా పూర్తి చేయాలని సూచించారు. 4, 5, 14 వార్డులలో నీటి సమస్య పరిష్కరించేందుకు బోర్లు వేయాలని నిర్ణయించామని అశోక్‌గౌడ్ చెప్పారు.